క్లుప్తంగా

నేటి నుంచి నూతన రేషన్ కార్డులు

రాజంపేట రూరల్ : నేటి నుంచి కొత్త నిబంధనలతో రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ పీర్‌మున్నీ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన కార్డులతో పాటు కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యులను నమోదు చేయటం, సభ్యులను తొలగించటం, రేషన్‌కార్డులను సరెండర్ చేయటం, తప్పుగా నమోదు కాబడిన ఆధార్ నెంబర్‌ను సరిచేయటం వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు తెలియజేశారు. ఈ సేవలు అవసరమైన వారు సంబంధిత సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట

పుల్లంపేట : మండల కేంద్రమైన పుల్లంపేట పంచాయతీలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నట్టు సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేశారు. అలానే భావనారుషి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున వీధులు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సర్పంచ్ సూచించారు. అలానే గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ నూర్జహాన్ పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా ఫాం పాండ్ పనులను పరిశీలించడమే కాకుండా అక్కడ కూలీలు మస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న కూలీలను పేరుపేరున మస్టర్‌లో పిలవడం జరిగింది. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఒకరి పనులు ఒకరు చేయకుండా ఒకరు పేరు మీద మరొకరు పనులకు రాకూడదని సూచించారు. ఉపాధి పనుల్లో ఎవరైనా ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన కార్మికుల నిరసన



నిరసనకు మద్దతు తెలుపుతున్న ఏపీఎన్‌జీజీ జేఏసీ చైర్మన్ శెట్టం వెంకటరమణ

రాజంపేట : అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజుకు చేరింది. ఏపీఎన్‌జీఓ జేఏసీ అధ్యక్షుడు శెట్టం వెంకటరమణ కార్మికుల నిరసనకు మద్దతు పలికారు. గత కొద్దినెలలుగా మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న నిరసనలను ప్రభుత్వం గుర్తించి, వారికి చట్టబద్ధంగా పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ 60 సంవత్సరాల నిర్ణయంతో మున్సిపాలిటిలో ముగ్గురిని తొలిగించారన్నారు. వారిని ఒట్టిచేతులతో ఇంటికి పంపించేశారన్నారు. నిరసనలో కార్మిక నేతలు పీవీ రమణ, లక్ష్మీప్రసాద్, రమణ, రాము, సుదీర్, ప్రమీల, బుజ్జమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

మూల విరాట్‌లకు ఇత్తడి తొడుగులు బహూకరణ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతీ భావనారాయణస్వామి, వెంకటేశ్వరస్వాముల మూల మూర్తులకు ఇత్తడి తొడుగులు కిరీటాలతో పాటు భద్రావతి భావనారాయణ, శ్రీవెంకటేశ్వర స్వాములు, శ్రీసీతా రామ లక్ష్మణ, హనుమంతుల మూలమూర్తులకు వెండి తిరునామాలను బుధవారం స్థానికులు అవ్వారు రవిశంకర్, బాబురావు సోదరులు బహూకరించారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు. గురువారం మహా నైవేద్యాలు, వసంతోత్సవం, తీర్థ ప్రసాదాలు వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో జేఎల్‌ఎంకు గాయాలు

రాయచోటి : ట్రాన్స్ కో పరిధిలో పనిచేస్తున్న జేఎల్‌ఎం పఠాన్ మాజీద్ ఖాన్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. బుధవారం సాయంత్రం విధి నిర్వహణలో భాగంగా ట్రాన్స్ కో ఏఈ డేనియల్ జోసెఫ్‌తో కలిసి లైన్ చెకప్‌కి వెళ్లారు. రాయచోటి - గాలివీడు మార్గంలోని ఎగువ అబ్బవరం సమీపంలో 33 కేవీ లైన్ మరమ్మతులు చేయడంలో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కాడు. మరమ్మతుల కోసం ఏఈ సబ్ స్టేషన్ నుంచి లైన్ క్లియర్ చేసుకున్నట్లు సమాచారం. అయితే విద్యుత్ స్తంభాల పైకి ఎక్కి మరమ్మతులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ రావడంతో లైన్‌మెన్ అక్కడికక్కడే కేకలు వేస్తూ కుప్పకూలిపోయాడు. వెంటనే విద్యుత్తు అంతరాయం నెలకొనడంతో అక్కడున్న సిబ్బంది హుటాహుటిన కేకలు వేస్తున్న మాజీద్‌ను కిందికి దింపారు. కాళ్లు, చేతులు భారీ కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మాజీద్‌ను హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

లాభాలు అధికం.. చేనుకు శ్రేయస్కరం

- వ్యవసాయంలో పెరిగిన వర్మీకంపోస్ట్ వినియోగం
- సేంద్రియ ఎరువులే వాడకమే మంచిదంటున్న రైతులు, అధికారులు
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఆదరణ



పాడిరైతు ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు కేంద్రం



వర్మీకంపోస్టు కేంద్రంలోని వానపాములను చూపుతున్న తయారీదారుడు

రాయచోటి టౌన్ : వ్యవసాయంలో రసాయినిక ఎరువుల వాడకం పెరిగాక పంటలో దిగుబడి తగ్గడంతో పాటు చీడపీడలు ఎక్కువ అయ్యాయి. దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం ఎక్కువైంది. అందుకే మళ్లీ సేంద్రియ ఎరువులనే వాడాలని ప్రభుత్వాలు చెప్పడంతో పాటు వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గుతుండమే కాకుండా దిగుబడులు కూడా అధికంగా వస్తున్నాయి. వినియోగదారులు సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, గింజలు, పండ్లు, కాయలపై మక్కువ పెంచుకుంటున్నారు. స్వయంగా ఇళ్ల వద్దనే సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని వాటి ద్వారానే వ్యవసాయం సాగిస్తున్నారు. అందులో భాగంగా కొందరు పాడి పరిశ్రమ ఉన్న రైతులు వర్మీకంపోస్టు ఎరువుల తయారీ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. వర్మీకంపోస్టును గ్రామాల్లోని రైతులకు విక్రయించి ఆదాయం పొందుతున్నారు. ఔత్సాహికులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే ఇలాంటి కుటీర పరిశ్రమలు మరిన్ని నెలకొల్పే అవకాశం ఉంటుంది. రైతులు కూడా వీటిని వాడకం పెంచితే భూమి మరింత సారవంతంగా మారడంతో పాటు మట్టి కలుషితం కానీయకుండా కాపాడుకోవచ్చని రైతులకు అధికారులు తెలియచేస్తున్నారు.

గత ప్రభుత్వం ప్రోత్సహించింది



వర్మీకంపోస్ట్ కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న తయారీ దారుడు

వర్మీ కంపోస్టు ఎరువు వాడకం పెరుగుతోంది. దీని వలన వ్యవసాయంలో ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడి అందుతుంది. మాలాంటి కుటీర పరిశ్రమదారులకు ఉపాధి కూడా లభిస్తోంది. నేను మా ఇంటిలోనే ఒక చిన్న కుటీర పరిశ్రమ లాగా కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాన్ని నిర్మించాను. ఒక చిన్న రేకుల షెడ్‌లో ఐదు పాదులను (తొట్లు) నిర్మించుకుని, ఒక్కో తొట్టికి రెండు లోడ్‌ల ఎరువు (పశువుల పేడ, పచ్చి గడ్డి, మిగిలిపోయిన కూరగాయలు, ఇతర కుళ్లిన కూరగాయలు, వ్యర్థ పదార్థాలు) వేస్తాను. కిలో వానపాములు (ఎర్రలు) రూ.500 చొప్పున 40కిలోలు తీసుకొచ్చి ఐదు తొట్లలో వదిలిపెడుతుంటా. ఇలా చేసిన తరువాత ప్రతి రోజు ఆ తొట్లకు నీళ్లు పట్టించి గోనె సంచులు పల్చగా పరుస్తాను. అప్పుడు లోపల ఉన్న వానపాములు ఆహారాన్ని తీసుకుంటూ ఎరువును తయారీకి తోడ్పాటునిస్తాయి. ఇలా ఒక్కో తొట్టి నుంచి 25 బస్తాల ఎరువు ఉత్పత్తి అవుతుంది. కిలో రూ.13 నుంచి రూ.15ల ప్రకారం రైతులకు విక్రయిస్తున్నాను. ఇలా తయారు చేసి వేయడం వలన ఇంటిలో ఉంటూ ఉపాధి పొందుతున్నాను. ఒక్కో విడతలో సక్రమంగా తయారు చేసుకొంటే రూ. లక్ష వరకు ఆదాయం లభిస్తుంది. సంవత్సరానికి నాలుగు విడతలు తయారు చేసుకోవచ్చు. పెట్టుబడి పోను సంవత్సరానికి రూ.4లక్షల వరకు వస్తుంది. అయితే రైతుల వాడకం పెరగాలి. అప్పుడే ఆదాయం లభిస్తుంది. గత ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రోత్సహించి ఎరువును రైతులకు సబ్సిడీతో అందించాలి.

– రామకృష్ణారెడ్డి, వర్మీ కంపోస్టు తయారీదారుడు

ఎకరానికి 25 బస్తాలు వాడితే ఫలితాలు



సేంద్రియ వ్యవసాయ పద్ధతి ఎక్కువైన తరువాత వర్మీ కంపోస్టు ఎరువుల వాడకం ఎక్కువైంది. ఈ పద్ధతిలో వ్యవసాయం చేయడం వలన వాతావరణం కాలుష్యం తగ్గడంతో పాటు రైతులకు లాభసాటిగా మారుతుంది. గతంలో అయితే సబ్సిడీతో కూడా వర్మీ కంపోస్టు ఎరువు కేంద్రాలను ఇచ్చాం. ప్రస్తుతం లేవు రైతులు ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకొస్తే వారికి సాంకేతిక పరమైన సలహాలు ఇస్తున్నాం. అలాగే రైతులను ప్రోత్సహించి ఇలాంటి ఎరువులు వాడాలని సూచిస్తున్నాం. ఎకరానికి 40 కిలోల బస్తాలు 25 బస్తాలు వాడితే (ఖర్చు సుమారు 13 వేల నుంచి రూ.15వేల వరకు వస్తుంది.) భూమి పూర్తిగా సేంద్రియ పద్ధతిలోకి మారుతుంది. ప్రస్తుతానికి అయితే ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీలు లేవు వస్తే నిర్వాహకులను ప్రోత్సహిస్తాం. ఈ ఎరువును ఎక్కుగా నర్సరీ నిర్వాహకులు, పూల పెంపకందారులు ఎక్కువగా వాడుతున్నారు.

– దివాకర్, వ్యవసాయ అధికారి, రాయచోటి

ఒంటిమిట్ట ఎంపీడీఓగా గౌస్ బాషా



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట ఎంపీడీఓగా ఎస్.గౌస్ బాషా బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈయన మదనపల్లి నియోజకవర్గం రామసముద్రం మండలం నుంచి బదిలీపై ఒంటిమిట్టకు వచ్చారు. మండలంలోని సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపుతానని పేర్కొన్నారు.

గ్రామీణులకు ఉచిత వైద్యం ఆదర్శనీయం



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామీణులకు చేయూత నివ్వడం ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని పెద్దకారంపల్లి సచివాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఉప సర్పంచ్ దాసరాజు వెంకటరాజు ఆధ్వర్యంలో తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామీణ ప్రజలకు వైద్య బృందం అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. శిబిరంలో వందలాది మందికి వైద్యం అందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత శిబిరంలో ఎంపీటీసీ ఎ.వరదరాజు(బాబు), వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు శ్రీను, రఘు, చంద్రమోహన్‌రాజు, గీతాల నరసింహారెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, జీవీ సుబ్బరాజు, దండు గోపీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు పాలకొండ్రాయుడు



పాలకొండ్రాయుడు భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : సుగవాసి పాలకొండ్రాయుడు ప్రజా నాయకుడు అని వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పాలకొండ్రాయుడు పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మృతిపట్ల సంతాపం తెలిపి కుమారులు సుగవాసి బాల సుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్ బాబులను పరామర్శించారు. పాలకొండ్రాయుడు రాజకీయ జీవితంలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సుకే పాటుపడి ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచారన్నారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్ బాషా, ఫయాజ్ అహ్మద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, అష్రఫ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సాదక్ అలీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ భాస్కర్, పట్టణ అధ్యక్షుడు నవాజ్, తిరుపాల్ నాయుడు, రియాజుర్ రెహమాన్, మాజీ కో-ఆప్షన్ జాఫర్ అలీఖాన్, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి ఇంతియాజ్, గోపాల రెడ్డి, అశోక్, కలీల్, చుక్కా అంజనప్ప, సగినాల శివ శంకర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించనప్పుడు గ్రామ సభలు ఎందుకు?



మాట్లాడుతున్న కార్యదర్శి సంధ్యారాణి

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీలో ప్రజలు తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతుంటే పరిష్కారం చేయలేనప్పుడు గ్రామ సభలు ఎందుకు పెడుతున్నారని పాలక మండలి సభ్యులు మండిపడ్డారు. సిద్దవటం మండలంలోని శాఖారాజులపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ శ్రీకాంత్ లేకపోవడంతో ఉప సర్పంచ్ కొండయ్య అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని పాలక వర్గం సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలు పరిష్కారం కానప్పుడు ఈ సభలు ఎందుకని పంచాయతీ పాలక వర్గ సభ్యులు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి గ్రామ పంచాయతీలో సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తాగునీటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండయ్య, పాలకవర్గ సభ్యులు శ్యామల, క్రిష్ణవేణి, చాముండేశ్వరి, అయ్యవారయ్య, నాగలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు అరుణ్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అందులో భాగంగా సహస్ర నామార్చన, మహానైవేద్యం, మంగళహారతి కార్యక్రమాలను చేపట్టారు. ఆరాధనోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైభవంగా వాసవీ మాత జయంతి



రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

రాజంపేట టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలో బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంతి వేడుకను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బరాయుడు స్వామి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నేడు తెప్పోత్సవం

వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంత్యుత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి ఏడు గంటల నుంచి తిరుపతి రోడ్డులో ఉన్న జిమ్మిచెట్టు వాసవి వనం వద్ద తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక పూజలు చేసిన ఆకేపాటి, పోలా

వాసవీ మాత జయంతి వేడుకలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రజలందరికీ సిరిసంపదలు కల్పించి, సుఖసంతోషాలను ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

నందలూరులో..

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ వాసవీ మాత జన్మదిన వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌తో పాటు ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి కేక్ ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించారు. కాగా రాజంపేట వాస్తవ్యులు ఎంబలూరు లక్ష్మీనారాయణ, అమృతమ్మలు రూ.1.16 లక్షల బంగారు ఆభరణాన్ని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంబలూరు నరసింహారావు, ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, ఉపాధ్యక్షులు మాకం వెంకటకుమార్, సెక్రటరీ గెలివి కుమార్, మేడా వెంకటకుమార్, మంచికంటి నారాయణ, ఎంబలూరు బాబు, ఎంబలూరు అనిల్‌కుమార్, మహిళా మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు గెలివి జయలక్ష్మీ, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నందలూరు: ఆలయ కమిటీ సభ్యులకు బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న దాతలు

అల్లూరి పోరాట పటిమ యువతకు ఆదర్శం

- ఆయన త్యాగాన్ని స్మరించుకున్న నేతలు
- అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని నివాళి అర్పించిన నాయకులు, ప్రజా సంఘాలు, అధికారులు



రాజంపేట టౌన్: అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆకేపాటి, పోలా



సిద్దవటం: బెటాలియన్‌లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ ఆనందరెడ్డి



రైల్వేకోడూరు అర్బన్: నివాళులు అర్పిస్తున్న నేతలు

రైల్వేకోడూరు అర్బన్ : స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ దేశానికే ఆదర్శమని బుధవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆయన కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి యువకుడు అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ వారితో పోరాడారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మనమంతా ఏకతాటిపై ఉండి దేశానికి, భారత సైన్యానికి అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, ముజీబ్, అన్వర్ బాషా, వెంకటరెడ్డి, హరికృష్ణారెడ్డి, ఆర్వీ రమణ, చంద్రశేఖర్, గోపీ, సుబ్రమణ్యంరాజు, మందల శివయ్య, మహేష్, రౌఫ్, ఆంజనేయులు, బండారు మల్లి, సుమ్మ రామరాజు, ఓబుల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుక నిర్వహించినట్లు కమాండెంట్ కె.ఆనందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని పేర్కొన్నారు. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కోసం తన ప్రాణాలు అర్పించిన యోధుడు అన్నారు. కేవలం 27 సంవత్సరాల వయస్సులోనే బ్రిటీష్ సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడని తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పి.ఎస్.డి. ప్రసాద్, కె. వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవ అగ్గిపిడుగు అల్లూరి – ఆకేపాటి

రాజంపేట టౌన్ : స్వాతంత్ర్య సమరంలో తెల్లదొరలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన విప్లవ అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. బ్రిటిష్ పాలకులు మన్యం ప్రజలను పెడుతున్న ఇబ్బందుల వల్ల వారి దీనస్థితిని చూసిన అల్లూరి తెల్లదొరల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విప్లవాన్ని ప్రారంభించారన్నారు. బ్రిటిష్ పాలకులకు సవాల్ విసిరి వారికి సింహ స్వప్నంలా తయారై రెండేళ్లపాటు తెల్లదొరలను గడగడలాడించారన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకుల తుపాకీ గుళ్లకు ఎదురెళ్లి 27 ఏళ్ల ప్రాయంలోనే అల్లూరి సీతారామరాజు వీరమరణం పొందారన్నారు. ప్రతి భారతీయుడు అల్లూరిని ఆదర్శంగా తీసుకొని గుండెనిండా దేశభక్తిని నింపుకోవాలన్నారు. లక్షలాది మంది ప్రాణత్యాగ ఫలితం వల్లే భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. దేశం బాగున్నప్పుడే ప్రజలంతా స్వేచ్ఛాయుతంగా, సంతోషకరమైన జీవనాన్ని సాగించగలరని పేర్కొన్నారు. తొలుత అల్లూరు సీతారామరాజు విగ్రహానికి ఆకేపాటి, పోలా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ, మున్సిపల్, మండలాల నాయకులతో పాటు కార్యకర్తలు ఉన్నారు.

నేడు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం

కడప కల్చరల్ : ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా సెక్రటరీ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని మట్టిపెద్దపులి వీధిలో ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. రెడ్‌క్రాస్ సభ్యులు, రెడ్‌క్రాస్ వలంటీర్లు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

పేరు మార్చినంత మాత్రాన అభివృద్ధి చేసినట్టా?



శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి జగదాంబ సెంటర్ : బోర్డుల మీద పేరు మార్చినంత మాత్రాన అభివృద్ధి చేసినట్టా అని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం రాయచోటిలోని జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న నవరత్న పథకంలో భాగంగా రాష్ట్రంలోనే అతి పెద్ద కాలనీలో అన్నమయ్య జిల్లాలోని నారాయణరెడ్డిపల్లె సమీపంలో ఉన్న జగనన్న కాలనీ ఆంధ్ర రాష్ట్రంలోని రెండో స్థానం లభించిందన్నారు. అలాంటి కాలనీకి కూటమి ప్రభుత్వం జగన్ హయాంలో జరిగిన అభివృద్ధి పథకాల పేర్లు మార్చి అంతా తామే చేశామని ప్రజలను మభ్యపెట్టడానికి యత్నిస్తుండటం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి 250 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను సేకరించి లేఅవుట్‌ను త్వరితగతిన పూర్తి చేయించి పేదలకు అంకితం చేయడం నియోజకవర్గ ప్రజలందరికి తెలుసన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో అమలైన అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం తమ పార్టీ రంగు పూసుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

విపత్కర పరిస్థితుల్లో రక్షణ కోసమే మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

గాలివీడు : విపత్కర పరిస్థితుల్లో తమతో పాటు తోటివారిని రక్షించడం కోసమే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు రాయచోటి ఆర్డీఓ శ్రీనువాసులు, లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తూముకుంట గ్రామం సోలార్ పవర్ ప్లాంట్‌లో అగ్నిమాపక సిబ్బందితో కలసి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత, అప్రమత్తత కోసమే ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ప్రవర్తించాలో అందరూ తెలుసుకోవడం కోసమే అవగాహన కల్పించామన్నారు. అంతేగాక తమ చుట్టూ అనుమానాస్పదంగా ఎవరైనా, ఏమైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాలివీడు తహసీల్దార్ భాగ్యలత, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారెడ్డి, గాలివీడు ఎస్ఐ రామకృష్ణ, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర, పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలకే ఉత్పత్తిదారుల సంఘాలు

గాలివీడు : వ్యవసాయంలో మెరుగైన సేవలు అందించి, రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టెరి సంస్థ ఇన్‌చార్జి కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామంలో నాబార్డు, నాఫెడ్ కేంద్ర ప్రభుత్వం, రైతుల భాగస్వామ్యంతో టెరి సంస్థ ప్రోత్సాహంతో రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటరమణ, గ్రామ సర్పంచ్ నారే మల్లికార్జున నాయుడు, కార్యాలయ సిబ్బంది సీఈఓ శారద, వెంకట మహేష్ కుమార్, బీఓడీ సభ్యులు నగేశఖర్ నాయుడు, చిన్నరెడ్డప్ప నాయుడు, మల్లికార్జున నాయుడు, సచివాలయం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.